

నవోదయ ప్రిన్సిపల్‌గా సీతాలక్ష్మి


ప్రిన్సిపల్ సీతాలక్ష్మి

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక నవోదయ విద్యాలయ ప్రిన్సిపల్‌గా బి.సీతాలక్ష్మి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ప్రిన్సిపల్ బదిలీపై వెళ్లడంతో.వైఎస్ ప్రిన్సిపల్ రామకృష్ణయ్య ఇప్పటి వరకూ ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపల్‌గా వ్యవహరించారు. పశ్చిమగోదావరి జిల్లా పెదవేగి నవోదయ విద్యాలయ వైస్ ప్రిన్సిపల్‌గా విధులు నిర్వహిస్తున్న సీతా లక్ష్మి పదోన్నతపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపల్ రామకృష్ణయ్య, ఆమెకు ప్రిన్సిపల్ బాధ్యతలను అప్పగించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది ఆమెకు స్వాగతం పలికారు.

కనీస వేతనం అమలయ్యేనా?

- సమస్యల వలయంలో ఆశ వర్కర్లు
- ఫిబ్రవరిలో అధికారుల చర్చల్లో పలు హామీలు
- అమలు మరచిన గత ప్రభుత్వం
- నూతన సర్కారుపైనే ఆశలు



ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

ఆశ వర్కర్స్‌కి కనీస వేతనం రూ.26 వేలు ఇచ్చి పెండింగులో ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఆశ వర్కర్లు రాష్ట్ర వ్యాప్తంగా అనేక ఉద్యమాలు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ అందిస్తున్న వైద్య, ఆరోగ్య సేవల్లో కీలక పాత్ర వహిస్తున్నా వారిని సర్కారు పట్టించుకోవడం లేదు. అరకొర వేతనాలకే పరిమితం చేసింది. ఆందోళనల నేపథ్యంలో వైసిపి ప్రభుత్వం హయాంలో ఈ ఏడాది ఫిబ్రవరిలో రాష్ట్ర స్థాయి అధికారులతో చర్చలు జరిగాయి. ఉన్నతాధికారులు స్పందించి సమస్యలను త్వరలోనే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కానీ నేటికీ అమలు కాలేదు. ఇటీవల అధికారంలోకొచ్చిన కూటమి ప్రభుత్వం తమ న్యాయమైన కోర్కెలను పరిష్కరిస్తుందనే ఆశతో వారు ఎదురు చూస్తున్నారు.

కనీస వేతనాల్లేవ్

కాకినాడ, తూర్పుగోదావరి, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లో 3,200 మంది ఆశ కార్యకర్తలు పనిచేస్తున్నారు. నిరంతరం ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం పనిచేస్తున్న ఆశాలకు కనీస వేతనం కరువైంది. రోజురోజుకీ పెరుగుతున్న నిత్యావసరాల ధరలను దష్టిలో పెట్టుకుని ప్రభుత్వం కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని అనేకేళ్లుగా కోరుతున్నారు. పప్పులు, బియ్యం, కూరగాయలు, పెట్రోలు, డీజిల్,గ్యాస్ ధరలు విద్యుత్, రవాణా ఛార్జీలు, చెత్త పన్ను అంటూ ఇలా గత ప్రభుత్వం పేదలపై అనేక భారాలను మోపింది. ఇటీవల నిత్యావసరాలు సరుకుల ధరలు పైపైకి ఎగబాగుతున్నాయి. దీంతో ప్రస్తుతం ఇచ్చే అరకొర వేతనం నెలలో పది రోజులకు కూడా సరిపోని పరిస్థితి ఏర్పడిందని ఆశాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అప్పులు చేసి కుటుంబాలను పోషించుకునే దుస్థితికి చేరారు. అప్పులు పుట్టక అనేకమంది పస్తులతో గడుపుతున్న పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇలా అనేకమంది ఆశాలు దుర్భర జీవితాలను అనుభవిస్తున్నారు. కాని పాలకులు వీరి సమస్యలను పట్టించుకున్న దాఖాలు లేవు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని, విధి నిర్వహణకు నాణ్యమైన సెల్ ఫోన్లు ఇవ్వాలని కోరుతున్నారు ఆశ యాప్‌తో బాటు వేరే ఇతర ఆన్ లైన్ వర్క్‌ల వల్ల ఒత్తిళ్లు ఎక్కువయ్యాయి. వాటిని నిరోధించాలని కోరుతున్నారు. లెప్రసీ, టిబికి సంబంధించిన సర్వేలు చేయిస్తున్నప్పటికీ వాటికి పారితోషకాలు ఇవ్వడం లేదు. గత సంవత్సరం చేయించిన సర్వేలకు ఇవ్వవలసిన పారితోషకాలు ఇంత వరకు ఇవ్వలేదు.కాబట్టి వాటిని వెంటనే చెల్లించాలి డిమాండ్ చేస్తున్నారు.

పెండింగ్‌లో ఉన్న అంశాలు

యూనియన్ నాయకులతో జరిగిన చర్చలు సందర్భంగా పలు అంశాలు పెండింగులో ఉన్నాయి. అలాగే అంగీకరించిన అంశాలకు సంబంధించి జిఒలను విడుదల చేయాల్సి ఉంది. కనీస వేతనాలు చెల్లింపు విషయం ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని కమిషనర్ ఇచ్చిన హామీ నేటికీ నెరవేరలేదు. ఏ కారణంతో మరణించినా రూ.10లక్షలు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని యూనియన్ ప్రభుత్వాన్ని కోరింది. పిఎం జెజెబివై పథకం అమలు విషయాలను ప్రభుత్వంతో చర్చించి తగు నిర్ణయం చేస్తామని కమిషనర్ తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ నివేదిక నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్‌కు సంబంధించి రూ.60 వేలు ఇస్తామని హామీ ఇచ్చారు. దీనికి యూనియన్ ప్రతినిధులు అంగీకరించలేదు. హర్యానాలో ఆశావర్కర్స్కు అమలవుతున్న విధంగా రూ.2 లక్షల ఇవ్వాలని కోరారు. ఈ విషయమై ప్రభుత్వంతో చర్చించి తగు నిర్ణయం తెలియజేస్తామని కమిషనర్ తెలిపారు. కమ్యూనిటీహెల్త్ వర్కర్లను ఆశావర్కర్‌గా మార్పునకు సంబంధించిన సమస్య ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ దష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి సహకరిస్తామన్నారు. ఎఎన్ఎం, జిఎన్ఎమ్ ట్రైనింగ్ పొందిన ఆశావర్కర్లకు ఖాళీల భర్తీలో వెయిటేజీకి అంగీకరించారు. అంగీకరించిన అంశాలకు సంబంధించి మినిట్స్ కాపీ, సర్క్యులర్స్, జిఒలను జారీ చేయాల్సి ఉంది. పెండింగ్లో ఉన్న రిటైర్మెంట్ బెనిఫిట్స్, సహజ మరణానికి ఎక్స్‌గ్రేషియో, సమస్యల పరిష్కారానికి మరో దఫా చర్చలు జరిపి పరిష్కరించాలని ఈ సందర్భంగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలి

ప్రస్తుతం అన్ని నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. మాకు ఇచ్చే వేతనం ఏ మూలకూ చాలడం లేదు. అప్పులు చేసి కుటుంబాలను పోషించుకోవాల్సిన పరిస్థితి వస్తుంది. పలు సర్వేలకు టిఎ, డిఎ బకాయిలు ఇవ్వాల్సి ఉంది. వాటిని వెంటనే విడుదల చేయాలి. రాజకీయ వేధింపులు ఆపాలి. నాణ్యమైన సెల్ ఫోన్లు ఇవ్వాలి.

- కె.శాంతమణి, ఆశావర్కర్, రాజమహేంద్రవరం


తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలంటూ గోడపై రాస్తున్న కార్మికులు

గోడలపై రాతలతో రాక్ కార్మికుల నిరసన

ప్రజాశక్తి - సామర్లకోట

తొలగించిన తమని విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ రాక్ సిరామిక్ కార్మికులు గోడలపై రాతలతో నిరసనను కొనసాగించారు. మంగళవారం సిఐటియు ఆధ్వర్యంలో రాక్ సిరామిక్ పరిశ్రమ పరిసర ప్రాంతాల్లోని గోడలపై తమ డిమాండ్లను రాస్తూ కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ తమను నిరంకుశంగా విధుల నుంచి యాజమాన్యం తొలగించిందని, తమను రోడ్డు పాలు చేసి 90 రోజులు గడుస్తున్నా యాజమాన్యం వైఖరిలో మార్పు రావడం లేదన్నారు. తిండి తిప్పలు లేకుండా తమ కుటుంబాలు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేసి అక్రమంగా తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకునేలా చర్యలు తీసుకోవాలని కార్మికులు కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి డి.క్రాంతికుమార్, మరిడమ్మ తల్లి పెయింటింగ్ యూనియన్ కార్యదర్శి గూనూరి రమణ, చంద్రశేఖర్, గంగాధర్, సతీష్, రామకృష్ణ, వంప్రసాద్, మల్లికార్జునరావు, గంగాధర్, క్రాంతి, మంగారావు, అర్జున్‌రావు, మూర్తి, సత్యనారాయణ, చంద్రన్న, ప్రభుదాస్, రామచంద్రయ్య, రాజబాబు, సతీష్ కుమార్, శివ నారాయణ, సుబ్బారావు పాల్గొన్నారు.

ఖాళీ స్థల యజమానులకు నోటీసులు

ప్రజాశక్తి - కాకినాడ


పూడికతీత పనులను పరిశీలిస్తున్న కమిషనర్

అపరిశుభ్రతకు, దోమల తీవ్రతకు కారణమవుతున్న ఖాళీ స్థలాల్లో నిలవ నీటిని వెంటనే తొలగించాలని నగర కమిషనర్ జె.వెంకటరావు స్థల యజమానులను ఆదేశించారు. మంగళవారం ఆయన స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ సమీపంలో జరుగుతున్న పూడికతీత పనులను పర్యవేక్షించారు. అనంతరం జగన్నాధపురం రణదీప్ నగర్ ప్రాంతంలోని మేజర్ డ్రెయిన్ సందర్శించారు. డ్రెయిన్‌లో పేరుకుపోయిన గుర్రపు డెక్కను తక్షణమే తొలగించాలని ఆదేశించారు. తూరంగి గ్రామ పరిధిలోని ఖాళీ స్థలాల్లో వర్షపు నీరు నిలవ ఉండడానికి గుర్తించారు. ఈ విషయాన్ని జిల్లా పంచాయతీ అధికారి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఖాళీ స్థలాలను నిరుపయోగంగా, నిర్లక్ష్యంగా వదిలిపెట్టడం వల్ల పిచ్చి మొక్కలు పెరిగి, డంపింగ్ యార్డుల్లా తయారై, దోమలు పెరిగి ప్రజారోగ్యానికి భంగకరంగా మారుతున్నాయన్నారు. ఈ విషయమై సిబ్బంది ప్రత్యేక ఫోకస్ పెట్టి ఖాళీ స్థలాలను శుభ్రం చేయించాలని ఆదేశించారు. కాకినాడ నగరపాలక సంస్థ పరిధిలోని సుమారు 160 మంది స్థల యజమానులకు నోటీసులు జారీ చేశామన్నారు. ఈ పర్యటనలో ఎంహెచ్‌ఒ డాక్టర్ పృథ్వీచరణ్, శానిటరీ సూపర్‌వైజర్ రాంబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


ఎరువుల స్టాకును తనిఖీ చేస్తున్న అధికారులు

నాణ్యమైన ఎరువులను రైతులకు అందించాలి

ప్రజాశక్తి - కాజులూరు


నాణ్యమైన ఎరువులను రైతులకు అందించాలని మండల వ్యవసాయ అధికారి ఎ.అశోక్ తెలిపారు. మంగళవారం స్థానిక సహకార సంఘంలో ఎరువుల విక్రయాలను ఆయన పరిశీలించి నమూనాలను సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఉన్న 8 సహకార సంఘాల తోపాటు, 21 ప్రయివేట్ ఎరువుల దుకాణాలను సందర్శించి నమూనాలను సేకరించామని తెలిపారు. ఉన్నాయన్నారు. ఎరువులు, పురుగు మందుల విక్రయాలకు సంబంధించి రైతులకు బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలని ఆదేశించారు. ఈ తనిఖీలలో సిఇఒ కె. వెంకటేశ్వరరావు, సచివాలయ వ్యవసాయ శాఖ సహాయకులు కిషోర్ నాయుడు పాల్గొన్నారు.

20న కరప మండల పరిషత్ సమావేశం

ప్రజాశక్తి - కరప

ఈ నెల 20న మండల పరిషత్ పాలకవర్గం సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ కె.అప్పారావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం 10.30 గంటలకు చంద్రన్న సమావేశ భవనంలో ఎంపిపి పెంకే శ్రీలక్ష్మి అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు, మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

కార్టూ'నిజం'



వృద్ధుల వివరాల సేకరణ

'ప్రజాశక్తి' కథనంతో కదిలిన అధికారులు

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి


బాధితురాలు భారతమ్మ నుంచి వివరాలు సేకరిస్తున్న కార్యదర్శి

వేర్వేరు కుటుంబాలకు చెందిన వృద్ధులు ఒకటే రేషన్ కార్డుపై రేషన్ పంచుకోవడం, పింఛన్‌ను సరిసగం పంచుకుంటున్న యధార్ధ సంఘటనను మంగళవారం ప్రజాశక్తి 'వేర్వేరు వృద్ధులకు ఒకటే కార్డు' కథనంతో వెలుగులోకి తెచ్చిన విషయం పాఠకులకు విధితమే. ఈ కథనంతో అధికార యంత్రాంగం కదిలింది. తక్షణమే ఇద్దరి వృద్ధులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కాకినాడ డిఎల్‌డిఒ నారాయణమూర్తి చరవాణి ద్వారా కొత్తపల్లి ఎంపిడిఒ నారాయణరావును ఆదేశించారు. దీంతో ఎంపిడిఒ ఆదేశాలతో గ్రామ కార్యదర్శి శ్రీనివాస్ మంగళవారం ఉదయం ఆ ఇద్దరి వృద్ధులను కలుసుకుని ఎప్పటి నుంచి ఈ విధానం కొనసాగుతుందనే అంశంపై ఆరా తీశారు. వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఆయన సేకరించారు. ఇందుకు సంబంధించి నివేదికను ఉన్నతాధికారుల అందచేస్తామని, మండలంలో ఇటువంటి పరిస్థితిపై పూర్తి స్థాయిలో ఆరా తీస్తున్నట్లు ఎంపిడిఒ 'ప్రజాశక్తి'కి వివరించారు. ఉప్పాడతోపాటు నాగులపల్లి, అమీనాబాద్ గ్రామాల్లో కూడా ఇటువంటి పరిస్థితులు ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందని ఎంపిడిఒ తెలిపారు. మండలంలో ఇలాంటి సమస్యలు ఉంటే వివరాలు సేకరించి చర్యలు చేపట్టాలని కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశామని తెలిపారు


బాధితురాలు బుచ్చమ్మ నుంచి వివరాలు సేకరిస్తున్న కార్యదర్శి

నగరంలో 5 అన్న క్యాంటీన్ల ఏర్పాటు

ప్రజాశక్తి - కాకినాడ


అన్న క్యాంటీన్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కమిషనర్

నగరంలో ఐదు అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేస్తు న్నామని, వీటిని ఆగస్టు 15 నుంచి ప్రారంభిస్తామని కమిషనర్ జె.వెంకటరావు తెలిపారు. మంగళవారం ఆయన అన్న క్యాంటీన్లను ప్రతిపాదించిన ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్నాథపురం అన్నమ్మగాటి, సంత చెరువు, వివేకానంద పార్క్, డైరీ ఫారం సెంటర్, బోట్ క్లబ్ ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రతిపాదిత ప్రాంతాల్లో అన్న క్యాంటీన్ల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే టెండర్లు పిలిచామని, గురువారం నాటికల్లా వీటిని ఖరారు చేస్తామన్నారు. ఎస్‌ఇ పి.సత్యకుమారి పర్యవేక్షణలో ఒక్కో అన్న క్యాంటీన్‌కు డిఇ స్థాయి అధికారిని ఇన్‌ఛార్జ్‌గా నియమించి పనులను వేగవంతం చేస్తున్నట్లు చెప్పారు. ఆగస్టు 10 నాటికి పనులన్నీ పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో ఎస్‌ఇ పి.సత్యకుమారి, స్మార్ట్ సిటీ ఎస్‌ఇ వెంకటరావు, ఇఇ మాధవి పాల్గొన్నారు.

వాడివేడిగా నగర పంచాయతీ సమావేశం

ప్రజాశక్తి - ఏలేశ్వరం


సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు

ఏలేశ్వరం నగర పంచాయతీ పాలకవర్గ సమావేశం వాడివేడిగా సాగింది. మంగళవారం నగర పంచాయతీ ఛైర్‌పర్సన్ అలమండ సత్యవతి అధ్యక్షతన పాలకవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు తీర్మానాలను వైసిపి కౌన్సిలర్లు వ్యతిరేకించారు. నగర పంచాయతీలోని అన్ని వార్డుల్లో తాగునీటిరు, డ్రెయినేజీ, వీధిలైట్లు సమస్య తీవ్రంగా ఉందని పలువురు కౌన్సిలర్లు కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చారు. సుమారు రూ.2 కోట్లతో రోడ్డుకు ఇరువైపులా చేపట్టిన డ్రెయినేజీ ద్వారా నీరు పారేందుకు అవకాశం లేకుండా పోయిందని కౌన్సిలర్ బదిరెడ్డి గోవింద్‌బాబు ఆక్షేపించారు. రోడ్డుపై ఉన్న వర్షపు నీరు డ్రెయినేజీలోకి వెళ్లకపోవడంతో రోడ్డుపైనే నిలిచిపోతుందన్నారు. కాంట్రాక్టర్ బాబుల్ రెడ్డి చేపట్టిన ప్రతీ పని అసంపూర్తిగానే ఉందన్నారు. టిడిపి కౌన్సిలర్ బొద్దిరెడ్డి గోపి మాట్లాడుతూ మెయిన్ రోడ్‌లో వీధిలైట్లు పనిచేయడం లేదని కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చారు. టిడిపి కౌన్సిలర్ మూది నారాయణస్వామి మాట్లాడుతూ అన్న క్యాంటీన్ పున్ణనిర్మాణం కోఊసం జిఒ వచ్చినా కౌన్సిలర్లకు తెలియజేయకపోవడంపై దారుణమన్నారు. వైసిపి కౌన్సిలర్ సుంకర హైమావతి చెత్తను తరలించే వాహనం ప్రతీ వీధిలోకి రావడం లేదని ససమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్‌పర్సన్స్, కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.


పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్న సర్పంచ్ పైలా సీత

పారిశుధ్య పనుల ప్రారంభం

ప్రజాశక్తి - రౌతులపూడి

మండలాల్లోని బలరాంపురం పంచాయతీలో మంగళవారం పారిశుధ్య నిర్వహణ పనులను ప్రారంభించారు. సీజనల్ వ్యాధుల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో పారిశుధ్య పనులు చేపట్టారు. ఎక్కువగా ఉండడంతో వ్యాధుల నివారణ లక్ష్యంగా పారిశుధ్య నిర్వహణ పనులు చేపడుతున్నామని సర్పంచ్ పైలా సీత అన్నారు ప్రజలందరూ నీటిని కాచి చల్లార్చుకుని తాగాలని, వేడి పదార్థాలను తీసుకోవాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎం కళ్యాణి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రహదారులకు మరమ్మతుల పనులు


ప్రజాశక్తి - తాళ్లరేవు


జెసిబితో పూడికను తొలగిస్తున్న సిబ్బంది

ప్రధాన రహదారుల్లో ఏర్పడిన గుంతలను పూడ్చే మరమ్మతు పనులకు పంచాయతీ అధికారులు శ్రీకారం చుట్టారు. వర్షాకాలం నేపథ్యంలో గ్రామ సర్పంచ్ రెడ్డి అరుణసుహాసినిదేవి ఆధ్వర్యంలో గ్రామంలోని మెయిన్‌రోడ్, చెరువు సెంటర్ ప్రాంతాల్లో వర్షపు నీరు నిల్వ ఉన్న ప్రాంతాలను చదును చేశారు. అలాగే మాధవరాయుని పేట, కేశవ స్వామి కాలనీ మురుగునీరు డ్రెయినేజీల్లో పూడికను తొలగించే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నున్న శంకర నారాయణ, మాజీ సర్పంచ్ రెడ్డి రెడ్డిబాబు, నాయకులు విత్తనాల పండు, సిబ్బంది సురేష్ పాల్గొన్నారు.

సిహెచ్‌సిని పరిశీలించిన ఎంఎల్ఎ జ్యోతుల

ప్రజాశక్తి - జగ్గంపేట


ఎంఎల్ఎ జ్యోతులను సత్కరిస్తున్న వైద్యులు

స్థానిక సిహెచ్‌సిని ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ మంగళవారం పరిశీలించారు. ఆపరేషన్ థియేటర్, జనరల్ వార్డు, ప్రసూతి వార్డు, ఎక్స్ రే తదితర విభాగాలను పరిశీలించిన అనంతరం ఆసుపత్రి వైద్యులతో సమీక్ష చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ప్రభుత్వంలో ప్రయివేటు ఆసుపత్రుల్లో సేవలకు ధీటుగా ప్రతి సామాన్యుడికి ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యాన్ని అందించాలని సూచించారు. అనంతరం వైద్యులు, సిబ్బంది ఆయనను సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు టి.ప్రణీత్, కే.భాగ్యలక్ష్మి, పివి.నిషా, విఎస్.సంధ్య, ఆర్.మాధురి, ఎం.తేజ, నాయకులు ఎస్‌విఎస్.అప్పలరావు, మారిశెట్టి భద్రం, బచ్చుల సుధీర్, పాల్గొన్నారు.


ప్రతిజ్ఞ చేయిస్తున్న సిడిపిఒ పూర్ణిమ

జాగ్రత్తలపై అవగాహన పెంచాలి : సిడిపిఒ

ప్రజాశక్తి - గండేపల్లి

సమాజంలో మహిళలు, బాలికలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహనను పెంపొందించాలని సిడిపిఒ ఎం.పూర్ణిమ సూచించారు. మంగళవారం స్థానిక వేలంపేట రామాలయం వద్ద మిషన్ శక్తి వంద రోజుల అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జులై 15 నుంచి 19 వరకూ మిషన్ శక్తి స్కీంపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. మిషన్ శక్తి లక్ష్యం మహిళల రక్షణ, భద్రత, సాధికారత అని అఅన్నరు. హింస, బెదిరింపులు లేని వాతావరణం కల్పించడం, ఆర్థికంగా శక్తి మంతులను చేయడం, ఆర్థిక అక్షరాస్యత, సూక్ష్మ రుణాలు ఇవ్వడం వంటి వాటిని ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ హనుమంతరావు, ఇఒపిఆర్‌డి విఎస్ఎన్.మూర్తి, ఆరోగ్య శాఖ హెల్త్ అసిస్టెంట్ పి.వీరబాబు, సూపర్‌వైజర్ ఎ.నాగపార్వతి, తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో రెవెన్యూ కార్యాలయం

-బిక్కుబిక్కుమంటూ విధుల్లో ఉద్యోగులు

ప్రజాశక్తి - సామర్లకోట


శిథిలావస్థకు చేరిన రెవెన్యూ కార్యాలయం(ఇన్‌సెట్‌లో చెమ్మతో గోడలు)

మండల రెవెన్యూ కార్యాలయం శిథిలావస్థకు చేరుకుంది. కార్యాలయ గోడలన్నీ వర్షపు నీటికి చెమ్మగిల్లి పోతున్నాయి. భవనం స్లాబ్ సైతం పెచ్చులుగా కిందకు పడుతున్నాయి. ఏ సమయంలో ఎటువంటి ఉపద్రవాన్ని ఎదుర్కోవాల్సివస్తుందో తెలియక బిక్కుబిక్కుమంటూ ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారు.

ప్రస్తుత రెవెన్యూ కార్యాలయాన్ని సమితి పాలనలో నిర్మించారు. సమితి కార్యాలయంగా ఈ భవనం దశాబ్దాలపాటు సేవలందిస్తూ వచ్చింది. ఈ కార్యాలయాన్నే మండల పరిషత్ కార్యాలయంగా మార్పు చేశారు. ఇలానడుస్తున్న నేపథ్యంలోనే సుమారు రెండు దశాబ్దాల కిందట పాత పోలీస్‌స్టేషన్ సెంటర్లో ఉన్న రెవెన్యూ కార్యాలయం శిథిలావస్థకు చేరుకోవడంతో అక్కడ నుంచి మండల పరిషత్ కార్యాలయంలో సగభాగాన్ని ఆధునీకరించి రెవెన్యూ కార్యాలయాన్ని తరలించారు. అనంతరం జరిగిన పరిణామాల్లో మండల పరిషత్ కార్యాలయానికి నూతన భవనాన్ని నిర్మించడంతో ఆ కార్యాలయం అక్కడకు చేరింది. నాటి నుంచి నేటికీ ఈ కార్యాలయంలోనే రెవెన్యూ కార్యాలయ కార్యకలాపాలు సాగుతున్నాయి. దశాబ్దాల కాలం నాటి భవనం కావడంతో నేడు కురుస్తున్న వర్షాలకు భవనం స్లాబ్‌ల నుంచి పెచ్చులు ఊడిపడుతున్నాయి. గోడలన్నీ వర్షపు నీటికి చెమ్మగిల్లి లోనికి నీరు ప్రవేశిస్తుంది. తడిచి ముద్దవుతున్న గోడలకు ఉన్న విద్యుత్ వైర్ల నుంచి షార్ట్ సర్క్యూట్ ప్రమాదం పొంచివుంది. స్లాబ్ నుంచి లీకుల వల్ల వర్షపు నీరు లోనికి పడటంతో రికార్డులు పాడవుతున్న పరిస్థితి నెలకుంది. ఇటువంటి పరిస్థితుల్లో రోజు వారీ వచ్చే వందలాది మంది ప్రజలకు రెవెన్యూ అధికారులు, సిబ్బంది బిక్కుబిక్కు మంటూ విధులను నిర్వర్తిస్తున్నారు. పొంచివున్న ప్రమాదాన్ని దృష్టిలో పెట్టుకుని జిల్లా అధికారులు తక్షణమే ప్రత్యా మ్నాయాలను ఆలోచించాలని ఉద్యోగులు, ప్రజలు కోరుతున్నారు.

ఈ నెల 21న పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి - పెద్దాపురం

సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షులు డాక్టర్ జోశ్యుల కృష్ణబాబు రచించిన 'తెలుగులో హరిచంద్ర నాటకాలు - తులనాత్మక పరిశీలన' పిహెచ్‌డి సిద్ధాంత గ్రంథాన్ని ఈనెల 21న విడుదల చేయనున్నట్లు సాహితీ స్రవంతి పెద్దాపురం కార్యదర్శి కొత్త శివ తెలిపారు. స్థానిక వెలమ కమ్యూనిటీ హాలులో మున్సిపల్ మాజీ ఛైర్మన్ రాజా సూరిబాబురాజు అధ్యక్షతన జరిగే సభలో ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప గ్రంథాన్ని ఆవిష్కరిస్తారని తెలిపారు.

ఉపాధి శిక్షణకు ఆహ్వానం

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట టిటిడిసి శిక్షణా కేంద్రంలో నిరుద్యోగ యువతులకు ఉచితంగా ఉపాధి శిక్షణ అందిస్తున్నట్టు డిఆర్‌డిఎ పీడీ శ్రీరమణి, జిల్లా జాబ్స్ మేనేజర్ ఎం.సంపత్‌కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని నిరుద్యోగ యువతులకు శిక్షణతోపాటు, ఉపాధి అవకాశలు కల్పిస్తూ ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సారీస్ పెయింటింగ్, ఎంబ్రాయిడరీ కోర్స్ కాలం 15 రోజులు ఉంటుందన్నారు. ఈ కోర్సులో చేరే యువత వయస్సు 18 నుండి 40 సంవత్సరాలు లోపు ఉండాలన్నారు. అలాగే విద్యార్హత 8వ తరగతి ఆపై ఉండాలన్నారు.

నేరాలు ఘోరాలు

పోక్సో కేసు నమోదు

ప్రజాశక్తి - రౌతులపూడి

మండలంలోని లచ్చిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన అడ్డాల రాజబాబుపై పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. లచ్చిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన ఓ గిరిజన యువతి తనను నమ్మించి గర్భవతిని చేసి మోసం చేశాడంటూ రాజబాబుపై ఫిర్యాదు చేసింది. దీనిపై మంగళవారం పెద్దాపురం డిఎస్‌పి లతాకుమారి గ్రామంలో విచారించారు. అనంతరం బాధితురాలిని వైద్య పరీక్షల నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఇందుకు కారకుడైన అడ్డాల రాజబాబుపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఏలేశ్వరం

మండలంలోని ఎర్రవరం జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి అక్కడికి అక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...పెద్దాపురం మండలం గుడివాడకు చెందిన కనపర్తి సూర్యుడు(80) ఫైనాన్సు నిమిత్తం తన మోటార్ సైకిల్‌పై ఏలేశ్వరం మండలం పేరవరం వచ్చి తిరిగి వెళుతుండగా జాతీయ రహదారిపై విశాఖ నుండి రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని భార్య ముగ్గురు కుమార్తెలు ఒక కుమారుడు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రత్తిపాడు తరలించినట్టు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - గండేపల్లి

మండల పరిధిలోని జెడ్ రాగంపేట జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు...సోమవారం సాయంత్రం రంపఎర్రవరం గ్రామానికి చెందిన కేతమల్ల సూర్యచంద్ర మోటార్ సైకిల్‌పై రాజానగరం నుంచి జగ్గంపేట వైపు వెళ్తుండగా జెడ్ రాగంపేట గ్రామ సమీపంలో వేగంగా వచ్చిన ఆటో వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సూర్యచంద్ర తలకు, కాళ్లకు గాయాలయ్యాయి. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఎస్ఐ ఎన్.రామకృష్ణ తెలిపారు.

కాంక్రీట్ మిక్సర్ బెల్ట్‌లో పడి కార్మికుని మృతి

ప్రజాశక్తి - సామర్లకోట

మండలంలోని చెందిన అచ్చంపేట గ్రామంలో కాంక్రీట్ మిక్సర్ రోలింగ్ యూనిట్‌లో మంగళవారం చోటుచేసుకుంది జరిగిన ప్రమాదంలో ఒక కార్మికుడు మృతి చెందాడు. బెల్ట్ ఆధారంగా తిరుగుతున్న మోటారులో కార్మికుడు చిక్కుకోవడంతో అతని శరీర అవయవాలు ఛిద్రమయ్యాయి. మృతుడు పిఠాపురం మండలం లక్ష్మీ నరసాపురం గ్రామానికి చెందిన బుర్రా సత్యనారాయణ గుర్తించారు. విషయం తెలిసి సంఘటనా స్థలానికి సామర్లకోట పోలీసులు చేరుకుని విచారణ చేపట్టారు. అయితే ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

తప్పిపోయిన యువతి అప్పగింత

ప్రజాశక్తి - సామర్లకోట

ఇంటినుంచి బయటకు వెళ్లి అదృశ్యమైన తెలంగాణా ప్రాంతానికి చెందిన మెదక్ జిల్లా మూసాయిపేట మండలం పోతనపూడి గ్రామానికి చెందిన రాజోలు రాజేశ్వరి (20)ని సామర్లకోట రైల్వే పోలీసులు ఆమె తల్లిదండ్రులకు మంగళవారం అప్పగించారు. స్థానిక రైల్వే ఎస్ఐ బి.లోవరాజు అందించిన వివరాల ప్రకారం...పోతనపూడి గ్రామానికి చెందిన రాజోలు బాలరాజు కుమార్తె రాజేశ్వరి ఫిబ్రవరి నెలలో ఇంటినుంచి బయటకు వెళ్లి కనిపించకుండా పోయింది. తల్లిదండ్రులు సికింద్రాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా అక్కడ కేసు నమోదైంది. అయితే అయిదు నెలలు గడుస్తుండగా సామర్లకోట రైల్వే స్టేషన్ ఎస్ఐ, రైల్వే పోలీస్ స్టేషన్ ప్లాట్‌ఫారం తనిఖీలో భాగంగా అనుమానితులైన ప్రయాణీకులను విచారి స్తుండగా తప్పిపోయిన రాజేశ్వరి పోలీసులతో కనిపించిన యువతిని పోలీసులు ఆరా తీశారు. అనంతరం ఆమె తల్లిదండ్రులకు సమాచారం అందించగా వారు మంగళవారం స్థానిక స్టేషన్‌కు చేరుకోగా వారి నిర్ధారణతో రాజేశ్వరిని తల్లిదండ్రులకు పోలీసులు అప్పగించారు.

మద్యం విక్రేత అరెస్ట్

ప్రజాశక్తి - ఆలమూరు

మద్యం విక్రయిస్తున్న ఒక వ్యక్తిని ఆలమూరు ఎస్ఐ పోలీసులు అరెస్టు చేసి, కేసు నమోదు చేశారు. ఎస్ఐ ఎస్ఐ కె.సత్యవేణి తెలిపిన వివరాల ప్రకారం.. మండపేట పట్టణంలోని గొల్లపుంతకు చెందిన దొంతంశెట్టి శివలింగేశ్వరరావు మద్యం విక్రయిస్తున్నాడని ముందస్తు సమాచారంతో సిబ్బందితో కలిసి దాడి చేసి పట్టుకున్నట్టు తెలిపారు. ఇందులో నిందితుడు 180 ఎంఎల్ సామర్థ్యంతో 19 మద్యం బాటిళ్లను కలిగి ఉండి అధిక ధరలకు విక్రయిస్తున్నాడన్నారు. స్వాధీనం చేసుకున్న మద్యాన్ని సీజ్ చేసి, నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సత్యవేణి తెలిపారు. అలాగే ఆలమూరు, కపిలేశ్వరపురం, పెదపూడి మండలాలలో ఎవరైనా ఇలాంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినట్లయితే సెల్ నెంబర్ 9959841282కు సమాచారం అందజేయాలని ఎస్ఐ విజ్ఞప్తి చేశారు.

బోదెలో పడి పశువుల కాపరి మృతి

ప్రజాశక్తి - గోపాలపురం

ప్రమాదవశాత్తు బోదెలో పడి పశువుల కాపరి మృతి చెందాడు. ఈ ఘటన గుడ్డిగూడెం గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు. గుడ్డిగూడెం గ్రామానికి చెందిన మాదుగుల అశోక్ అదే గ్రామానికి చెందిన కామిశెట్టి మురళీకృష్ణ అనే రైతుకు చెందిన పశువులను మేపుతుంటాడు. సోమవారం ఎప్పటిలాగే పశువులను తోలుకొని వెళ్లాడు. సాయంత్రం 6 గంటలైనా పశువులను అశోక్ తీసుకు రాకపోవడంతో రైతు గాలింపు చర్యలు చేపట్టాడు. పశువులు గ్రామ శివారులో చింతలపూడి కాలువ వద్ద ఉన్నట్లు గుర్తించారు. అశోక్ కనిపించలేదు. దీంతో గోపాలపురం పోలీస్ స్టేషన్లో అదే రోజు రాత్రి ఫిర్యాదు చేశారు. మంగళవారం తెల్లవారుజామున ఒక జామాయిల్ తోట వద్ద ఉన్న బోదెలో పడి ఉన్న అశోక్ శవాన్ని గుర్తించారు. బోదెలో గాలింపు చేపట్టగా అశోక్(26) మృతదేహం లభ్యమైంది. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గోపాలపురం సామాజిక ఆరోగ్య కేంద్రంకు తరలించినట్లు తెలిపారు.

నూతన చట్టాలపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - పెద్దాపురం

నూతన క్రిమినల్ చట్టాలపై మహిళలు, బాలికలకు పూర్తిస్థాయి అవగాహన కల్పించాలని స్త్రీ శిశు సంక్షేమ శాఖ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ ప్రవీణ అన్నారు. మంగళవారం స్థానిక రెవెన్యూ కార్యాలయ ఆవరణలోని స్త్రీ శక్తి భవనంలో సిడిపిఓ జి.ఉష అధ్యక్షతన నూతన క్రిమినల్ చట్టాలపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇండియన్ పీనల్ కోడ్ స్థానంలో భారతీయ న్యాయ సంహిత, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ స్థానంలో భారతీయ నాగరిక సురక్ష సంహిత, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ స్థానంలో భారతీయ సాక్ష్య అధినయంగా మార్పు చెందాయన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు ఉమాదేవి, చంద్రకళ, వెంకటలక్ష్మి, ప్రమీల, తెలుసామంగ, బేబీ పాల్గొన్నారు.



ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

నూతన కార్యవర్గం ఏకగ్రీవం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ 327 రాజమహేంద్రవరం సర్కిల్‌లో నూతనంగా ఏర్పడిన రాజమహేంద్రవరం రూరల్ డివిజన్ కమిటి ఎన్నికైంది. కంపెనీ గౌరవ అధ్యక్షులు కాశీ మోహన్‌రావు, స్టేట్ సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్, కంపెనీ కార్యదర్శి పిఎస్ఎస్.వెంకటేశ్వర రావు, స్టేట్ జనరల్ సెక్రటరీ, జిల్లా కార్యదర్శి అంబటి రాజారత్నం, స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ తోట చిన వెంకట్రావు, టౌన్ డివిజన్ ప్రెసిడెంట్ ముప్పిడి గణేష్, సెక్రటరీ కొప్పిశెట్టి శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్లు చల్లారామ్, అరె రాంబాబు, బుల్లాబ్బాయ్, గంట్లని రమేష్ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. డివిజన్ గౌరవ అధ్యక్షులుగా తుమ్మల తాతరావు, డివిజన్ ప్రెసిడెంట్‌గా ఎంసిహెచ్.అప్పలరాజు, సెక్రటరీగా పిల్లి వైవి.ప్రసాద్, ట్రెజరర్‌గా కుసుమ శివ ప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎం.మాధవరావు, పబ్లిసిటీ సెక్రటరీగా ఐ.దుర్గాప్రసాద్, అడిషనల్ సెక్రటరీగా పి.నాగబాబు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా శ్రీనివాస్, అసిస్టెంట్ సెక్రటరీగా బి.రత్నరాజు, వైస్ ప్రెసిడెంట్‌గా ఎన్‌వివి.సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.



నూతన కమిటీ నాయకత్వంలో అతిథులు

బాలలు, మహిళల చట్టాలపై అవగాహన



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ నిభావని

ప్రజాశక్తి - తాళ్లరేవు

పనిచేసే చోట మహిళలపై లైంగిక వేధింపులు జరిగిన 2013 ఆ చట్టం ప్రకారం కఠిన శిక్షలు విధించబడతాయని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ నిభావని తెలిపారు. మంగళవారం మాధవరాయని పేట అంగన్‌వాడీ కేంద్రంలో మహిళలు, బాలల హక్కుల చట్టాల పై అవగాహన సదస్సు జరిగింది. బాల్య వివాహాలు జరిగిన, ప్రోత్సహించిన వారిపై చట్ట పరమైన చర్యలు ఉంటాయని, హిందూ, ముస్లిం, క్రైస్తవ సంప్రదాయం ప్రకారం ఏ విధంగా జరిగిన బాల్య వివాహాలు ఎవరు జరిపిన, వారందరి పైన చర్యలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పవన్ అభిమాని సైకిల్ యాత్ర

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

అమీనాబాద్ గ్రామానికి చెందిన పవన్ కళ్యాణ్ వీరాభిమాని దాడిచర్ల లక్ష్మణరావు విజయవాడ కనకదుర్గ గుడికి. సైకిల్‌పై మంగళవారం ఉదయం బయలుదేరాడు. యానంకు చెందిన లక్ష్మణరావు గత కొంతకాలం నుంచి అమీనాబాద్ గ్రామంలో ఉన్న బంధువులు ఇంటి వద్ద నివాసం ఉంటున్నాడు. గడిచిన సాధారణ ఎన్నికల రావడం, పిఠాపురం నుంచి పవన్ కళ్యాణ్ ఎంఎల్ఎగా విజయం సాధిస్తే విజయవాడ కనకదుర్గ ఆలయానికి వస్తానని లక్ష్మణరావు మొక్కుకున్నాడు. ఆ మొక్కును తీర్చుకునేందుకు మంగళవారం సైకిల్‌పై విజయవాడ బయలుదేరే క్రమంలో కొత్తపల్లి గ్రామానికి చెందిన జనసేన నాయకుడు సానా లోవరాజు, గవర రాంబాబు లక్ష్మణరావుకు పూలదండ వేసి, ఫ్రూట్స్, ఇతర ఆహార సామాగ్రిని అందజేసి సైకిల్ యాత్రని ప్రారంభించారు. సైకిల్‌పై ప్రారంభమైన యాత్ర కొత్తపల్లి నుంచి పిఠాపురం, సామర్లకోట, ద్వారపూడి, అనపర్తి,. రాజమహేంద్రవరం మీదుగా మీదుగా విజయవాడ చేరుకుంటానని లక్ష్మణరావు తెలిపాడు.



సైకిల్ యాత్రను ప్రారంభిస్తున్న జనసేన నాయకులు

యానాం వార్తలు



మునిస్వామికి వినతి పత్రం ఇస్తున్న రైతు సంఘం నాయకులు

జంగిల్ క్లియరెన్స్ అయ్యాకే బిల్లు ఇవ్వాలి

ప్రజాశక్తి - యానాం

స్థానిక దరియాలతిప్ప ఫ్రెంచ్ కెనాల్‌కు ఇరువైపులా జంగిల్ క్లియరెన్స్, కెనాల్‌లో పూడికతీత పనులు పూర్తియ్యాకే సంబంధిత కాంట్రాక్టర్‌కు బిల్లులు ఇవ్వాలని దరియాలతిప్ప రైతు సంఘ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఆర్ఎఒ మునిస్వామిని వారు కలిపి వినతిపత్రాన్ని ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలువలో పూడికను పూర్తిస్థాయిలో తీయలేదని, దీనివల్ల కాలువలో చివరి పొలాల వరకు నీరు పారడం లేదన్నారు. జంగిల్ క్లియరెన్స్‌ను ప్రొక్లైనర్‌తో చేసి కోట్ల రూపాయలతో నిర్మించిన ర్యాంపును పాడు చేశారని వివరించారు. అసంపూర్తిగా పనులు చేశారని, కావున పూర్తి స్థాయిలో పనులు చేపట్టాకే బిల్లులు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం ప్రెసిడెంట్ తిరుకోటి భైరవమూర్తి, వైస్ ప్రెసిడెంట్ వాకపల్లి సుబ్బారావు, సెక్రటరీ మట్టా రాంబాబు, జాయింట్ సెక్రెటరీ సబ్బతి రాంబాబు, ట్రెజరర్ సబ్బతి లోకేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



ఆలయానికి మైకుసెట్టును అందిస్తున్న దాతలు

సాయిబాబా గుడికి మైకుసెట్టు బహూకరణ

ప్రజాశక్తి - యానాం

స్థానిక కనకాల పేటలో ఉన్న సాయిబాబా గుడికి దాతల సహకారంతో మైకు సెట్ ఏర్పాటు చేయడం జరిగిందని ఆలయ కమిటీ సభ్యులు దాసరి శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా మైకు సెట్ ఏర్పాటు చేసిన సాలిగ్రామ విశ్వనాథ శర్మ, కడలి వాసు, నాయుడు శ్రీమాధవ పరిమళ, సుధా ప్రసాద్, కొమ్మిరెడ్డి పరశురాం, సిహెచ్ భరతుడులకు ఆలయ కమిటీ, సాయిబాబా యూత్ కృతజ్ఞతలు తెలిపారు.



విద్యార్థులకు పుస్తకాలు అందచేస్తున్న గ్రామ పెద్దలు

పేద విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి - యానాం

స్వచ్ఛ సేవా సమితి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ జరిగింది. మంగళవారం స్థానిక మెట్టకూరు, ఆదిఆంధ్రపేటలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ తన సొంత ఖర్చులతో విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులను గ్రామ పెద్దల చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఎంఎల్ఎకు కృతజ్ఞతలు తెలిపారు.

సర్పవరంలో మహిళ దారుణ హత్య

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

కాకినాడ రూరల్ మండలం సర్పవరం భావన్నారాయణపురంలో ఓ మహిళ దారుణ హత్యకు గురియైన సంఘటన మంగళవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. ఒరిస్సా రాష్ట్రం గుంజామ్ జిల్లాకు చెందిన భార్యభర్తలు జీవనోపాధి కోసం 3 నెలల క్రితం సర్పవరం భావన్నారాయణపురానికి వలసవచ్చారు. వీరికి మూడేళ్ళ బాబు ఉన్నాడు. భర్త నిల్లు స్ప్రైన్ మూడురోజులుగా కూలి పని మానేసి మద్యం సేవించి భార్య కైరా పుటితో గొడవ పడుతున్నాడు. సమీప బంధువులు నచ్చచెప్పారు. మంగళవారం బంధువులు ఫోన్ చేసిన కైరా పుటి స్పందించక పోవడంతో అనుమానం వచ్చి వాళ్ళు నివాసముంటున్న ఇంటికి వచ్చారు. అప్పటికే కైరా పుటి(31) మృతి చెందినట్లు గుర్తించి వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని విచారించారు. భార్య, భర్తల మధ్య ఘర్షణలలో భర్త నిల్లు స్ప్రైన్ ఆమెను నెట్టివేయడంతో తలకు గాయమై ఉంటుందని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం కాకినాడ జిజిహెచ్‌కు తరలించారు. ప్రస్తుతం భర్త నిల్లు స్ప్రైన్ కోసం గాలిస్తున్నట్లు తెలిపారు.

ప్రజా సంక్షేమానికి ప్రభుత్వాలు కృషి చేయాలి

ప్రజాశక్తి-అయినవిల్లి

కేంద్రంలోనూ,రాష్ట్రంలోనూ ఏర్పడిన కూటమి ప్రభుత్వాలు ప్రజా సంక్షేమానికి కృషి చేయాలని అయినవిల్లి జెడ్‌పిటిసి. మాజీ సభ్యురాలు గంగుమళ్ళ కాశీ అన్నపూర్ణ, శ్రీనివాస్ అన్నారు. స్థానిక కె.జగన్నాథపురం గ్రామపంచాయతీ కార్యాలయంలో ప్రధాని నరేంద్ర మోడీ, ఎపి సిఎం నారా చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ ల చిత్రపటాలను మంగళవారం ఆమె ఆవిష్కరించారు. పంచాయతీ కార్యదర్శి విత్తనాల వెంకటరమణ అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

ప్రజాశక్తి-మామిడికుదురురూరల్

వర్షకాలం నే పథ్యం లో అంటు వ్యాధుల ప్రబలే ప్రమాదము పొంచి ఉందని ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తీర్చుకోవాలని నగరం పిహెచ్‌సి వైద్యాధికారి స్వర్ణలత అవగాహన కల్పించారు మంగళవారం బి.దొడ్డవరం లో వైద్య శిబిరం నిర్వహించి వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ యజ్ఞేశ్వరరావు, ఎఎన్ఎం ఉమా భవాని, ఎంఎల్‌హెచ్‌పి స్వరూప తదితరులు సేవలు అందించారు.

5 ప్రత్యేక కౌంటర్లలో టమోటా విక్రయాలు

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

బహిరంగ మార్కెట్‌లో టమోటా ధరలు ఎక్కువగా ఉన్న దృష్ట్యా రైతుబజార్లలో అమ్మే ధరలకే నగరంలోని ఐదు బహిరంగ ప్రదేశాల్లో టమాటా విక్రయాలు నిర్వహించనున్నట్లు జిల్లా వ్యవసాయ మార్కెటింగ్ సహాయ సంచాలకులు ఎం.సునీల్ వినయ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ చర్యలు తీసుకున్నామన్నారు. రాజమహేంద్రవరంలో మల్లయ్యపేట, ఎవి.అప్పారావు రోడ్డు, ప్రకాష్ నగర్, స్టేడియం రోడ్డు, బొమ్మూరు ప్రాంతాల్లోని ప్రధాన సెంటర్లలో ఔట్ లెట్స్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ధరల స్థిరీకరణకు ప్రభుత్వం కృషి

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం

నిత్యావసర వస్తువుల ధరల స్థిరీకరణే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని సిటీ ఎంఎల్ఎ ఆదిరెడ్డి అప్పారావు అన్నారు. మంగళవారం ఆర్అండ్‌బి కాలనీలో రైతు బజార్ ద్వారా టమోటా విక్రయాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. బహిరంగ మార్కెట్లలో నిత్యావసర సరుకులు కూరగాయలు అధిక ధరలు ఉన్నందున సామాన్య, మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ప్రభుత్వం మార్కెటింగ్ శాఖ వారి ఆధ్వర్యంలో రైతు బజార్ల ద్వారా టమాటా కిలో రూ.55కే విక్రయిస్తున్నామన్నారు. అదేవిధంగా నేడు బహిరంగ మార్కెట్లో ఉన్న రేటు కంటే రు.20 తగ్గించి కందిపప్పును, రూ.10 తగ్గించి బియ్యాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులు సునీల్ వినయ్ రైతు బజార్ ఎస్టేట్ అధికారి శ్రీనివాస్‌బాజీ స్థానిక నాయకులు కొయ్యల రమణ, కాశీ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షల్లో నిబంధనలు తప్పనిసరి

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ పరీక్షల్లో నిబంధనలు తప్పనిసరి అని కలెక్టర్ పి.ప్రశాంతి స్పష్టం చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో స్కానింగ్ సెంటర్లలో ఆకస్మిక తనిఖీలు చేసే విధంగా నిఘా వ్యవస్థను పెంచాలన్నారు. తనిఖీలో ఎవరైనా లింగం నిర్ధారణ పరీక్షలు నిర్వహించినట్లు ఆధారాలు లభ్యమైతే సంబంధిత నిర్వాహకులపై చట్టపరమైన కేసులు నమోదు చేయడంతో పాటు స్కానింగ్ సెంటర్ లైసెన్స్‌ను రద్దు చేయాలన్నారు. అపరాధ రుసుం వేయాలన్నారు. పూర్తిస్థాయిలో స్కానింగ్ యూనిట్‌ను పరిశీలించిన తరువాతనే అనుమతి ఇవ్వాలని డిఎంహెచ్‌ఒను ఆదేశించారు.

జిల్లాలో లింగ నిష్పత్తి సంఖ్య 800 కంటే తక్కువగా ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించి ప్రజలకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ ఏడాది జరిగిన ప్రసవాలు, లింగ నిష్పత్తి నివేదికను అందించాలన్నారు. ఈ ఏడాది సరోగసి కోసం దరఖాస్తు చేసుకున్న వారికి మెడికల్ బోర్డు నుంచి అనుమతి పొందిన మాత్రమే పరిశీలిస్తామన్నారు. ఈ సమావేశంలో డిఎంఅండ్‌హెచ్‌ఒ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, డిసిహెచ్ఎస్ డాక్టర్ ఎన్‌పి.పద్మశ్రీ, డిఐఒ డాక్టర్ ఎన్.రాజకుమారి, దిశ డిఎస్‌పి ఆదినారాయణ, డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ ఎం.శ్రీహరిబాబు, ఐసిడిఎస్ పీడీ కె.విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

అనధికార డంపింగ్ యార్డ్‌ను తొలగించాలి

ప్రజాశక్తి - నిడదవోలు

అనధికార డంపింగ్ యార్డును తొలగించాలని జై భీమ్ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ క్లబ్, కెవిపిఎస్ నాయకులు మీకోసంలో ఫిర్యాదు చేశారు. నిడదవోలు చుట్టుపక్క ప్రాంతాల్లో ఉన్న వ్యర్థాలను, చెత్తను తీసుకొచ్చి జననివాసాలు ఉంటున్న ప్రాంతంలో డంపు చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నార. ఈ డంప్ చేస్తున్న ప్రాంతం చెంతనే మార్కెట్, ప్రభుత్వ ఆసుపత్రి, సచివాలయం, మున్సిపల్ కాంప్లెక్స్ ఉన్నాయన్నారు. పేదలు నివాసం ఉండే ఈ ప్రాంతంలో చెత్తను డంప్ చేయడం తగదన్నారు. వెంటనేద దీన్ని తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో తూరుగోపు నాగేంద్ర పాల్గొన్నారు.

హాస్టల్స్ నిర్వహణపై దిశానిర్దేశం

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

హాస్టల్స్ నిర్వహణపై సంక్షేమ శాఖల అధికారులకు కలెక్టర్ పి.ప్రశాంతి దిశానిర్దేశం చేశారు. మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలోని అన్ని సాంఘిక, గిరిజన, బిసి సంక్షేమ వసతిగృహాల నిర్వహణ, మౌలిక సదుపాయాల విషయంలో ప్రత్యేక దృష్టి సారించాలి అని స్పష్టం చేశారు. విద్యా విధానంలో మెరుగైన ఫలితాలను సాధించడంలో ఆయా వసతిగృహాల నిర్వహణ కూడా ఒక ప్రధాన అంశం అన్నారు. వివిధ పత్రికల్లో, సామాజిక మాధ్యమాల్లో వసతిగృహాలపై ప్రతికూల కథనాలు వస్తున్నాయని, సరైన నిర్వహణ వ్యవస్థ దిశగా అడుగులు వేయాల్సి ఉందన్నారు. వసతి గహాలలో తక్షణం చేపట్టాల్సిన మరమ్మతులుకు సిఎస్ఆర్ నిధులను కేటాయించి సమస్య పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. అందుకు అనుగుణంగా ప్రతిపాదన సిద్ధం చేసి నివేదిక అందజేయాలన్నారు. ఈ సమావేశం జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి ఎం.సందీప్, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి కెఎస్.జ్యోతి, కొవ్వూరు బిసి సంక్షేమ అధికారి కె.రామకృష్ణ పాల్గొన్నారు.